

శుభలేఖ.. ఇచ్చే సమయం లేక
వివాహ ఆహ్వానంలో ట్రెండ్ మారింది. క్రమేపీ పెళ్లిపత్రికల పంపిణీ తగ్గుతోంది. వాట్సాప్ ద్వారా చిటికెలో పెళ్లిపత్రికలు పంపిస్తున్నారు. -8లో



స్కూలు విద్యార్థుల ఆటో బోల్తా
పాఠశాల వదిలాక సొంత గ్రామానికి వెళదామంటే ఆర్టీసీ బస్సు లేదు. ఆటో ఎక్కిన నలుగురు విద్యార్థులు మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.5/15.2

వాతావరణం
జిల్లాలో బుధవారం 15.2 - 35.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న దుకాణాలకు ఐదు సంవత్సరాల లీజుకు ఔత్సాహికులైన వ్యాపారవేత్తలు, నిరుద్యోగుల నుంచి టెండరు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో పరిధిలో 20, పులివెందుల 12, వేంపల్లె 9, బద్వేలు 22, పోరుమామిళ్ల 5, మైదుకూరు 10, జమ్మలమడుగు 10, ముద్దనూరు 1, రాజుపాలెం 2తోపాటు అన్ని డిపోలలో బరువు తూచే యంత్రాలు, ప్రకటనల బోర్డుల కోసం టెండరు దరఖాస్తులు ఈనెల 18వ తేదీలోగా అన్ని డిపోల్లో లభ్యమవుతాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయాలన్నారు. ఈ టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు అందరి సమక్షంలో తెరువడం జరుగుతుందని తెలిపారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ షంషుద్దీన్

ఖాజీపేట: కష్టపడి చదివి పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ విద్యార్థులకు సూచించారు. ఖాజీపేటలోని ఉర్దూ పాఠశాలను ఆయన సందర్శించారు. 10వ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అధ్యాపకుల పనితీరు పై విచారణ జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని, అందుకు తగ్గట్లు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఖైదీలకు వైద్య పరీక్షలు



వ్యాధి నిర్ధారణ కోసం సర్వేలెన్స్ నిర్వహిస్తున్న అధికారులు

కడప అర్బన్: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ప్రభుత్వ మంత్రిత్వకుటుంబ సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను కడప కేంద్రకారాగారంలో ఖైదీలకు బుధవారం నిర్వహించారు. సర్వేలెన్స్‌లో భాగంగా జైళ్లలోని ఖైదీలకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి అండ్ సీలకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తారు. వ్యాధులను నిర్ధారించిన తర్వాత వ్యాధి గ్రస్తులకు వైద్య సహాయం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కె. రాజేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు ఎస్. కమలాకర్, రమేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీసాక్స్ క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్. అలీహైదర్, వైద్యాధికారులు డాక్టర్ జి. పుష్పలత, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కె.బి నవీన్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ విజయ చంద్ర, వైద్య సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

ఇంటింటా న్యాయ ప్రచారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటింటి న్యాయ ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచించారు. బుధవారం కడపలోని ఎన్జీఓ కాలనీలో ఇంటింటి న్యాయ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఇక్కడి భవిత కేంద్రాన్ని కూడాసందర్శించి పిల్లలను పలుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాల సమస్యలను గుర్తించి నివారణ కోసం ఇంటింటి న్యాయ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 46 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 5609 గృహాలను సందర్శించి, అందులో 99 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించామన్నారు. వారికి కడప, ప్రొద్దుటూరులలో జిల్లా సత్వర చికిత్స కేంద్రం, జిల్లా బాల భవిత కేంద్రాల్లో సంప్రదించాలని సూచించామన్నారు. వివరాలకు డిస్ట్రిక్ట్ ప్రోగామ్ ఆఫీసర్ కడప 90142 65600, ప్రొద్దుటూరు 8121952684 నంబర్లలో సంపదించాలన్నారు.కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవిత కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కన్నీటి దిగుబడి



- మరో 18 రోజుల్లో ముగియనున్న రబీ
- తగ్గిన వరి, మినుము, శనగపంటల దిగుబడులు
- ఆందోళనలో అన్నదాతలు



తెగుళ్లతో దెబ్బతిన్న శనగపంట



ఎర్రగుంట్ల ప్రాంతంలో శనగను నూర్పిళ్లు చేస్తున్న రైతులు



తెగుళ్లతో దెబ్బతిన్న మినుముపంట

కడప అగ్రికల్చర్: ఆరుకాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులకు పంటల దిగుబడి చేతికొచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలు నట్టేట ముంచుతున్నాయి.ఈ ఏడాది కూడా అలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. రబీ సీజన్‌లో అధిక వర్షాలతో సాగు చేసిన పంటలకు తెగుళ్ల బెడద ఎక్కువై దిగుబడులు పడిపోయాయి. దిగుబడి సొమ్ము పంటలసాగు ఖర్చులకు సరిపోయిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది సాగు ఖర్చులు కూడా రాలేదని వాపోతున్నారు.

- ఈ ఏడాది రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 1,42,988 హెక్టార్ల సాధారణ సాగుకు 1,12,003 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. కానీ చాలా మేరకు పంటలు తెగుళ్లు బారిన పడ్డాయి. దీంతో దిగుబడిపై ప్రభావం చూపింది..ముఖ్యంగా మినుము, శనగ, వేరుశనగ, వరి పంటలపై ప్రభావం అధికంగా పడింది. చాలామంది రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందలేదు.
- జిల్లాలో ఈ ఏడాది ఆరుతడి పంటల కింద మినుముపంట సాగు చేశారు. జిల్లాలో సాధారణ సాగు 14731 హెక్టార్లు కాగా ఈ ఏడాది 16757 హెక్టార్లలో సాగైంది. జిల్లాలో పెండ్లిమర్రి, కమలాపురం, ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లి, లింగాల, ఖాజీపేటలతోపాటు పలు మండలాల్లో మినుముపంట సాగు చేశారు. అయితే అధిక వర్షాల కారణంగా తెగుళ్ల సోకి దిగుబడి పూర్తిగా పడిపోయింది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది ఎకరాకు 2 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీంతో చాలామందికి సాగు ఖర్చులు కూడా రాలేదని పలువురు రైతులు తెలిపారు.

రబీలో పంటలసాగు వివరాలు ఇలా...

పంటలు	సాధారణసాగు	సాగైంది
జొన్న	7917	5074
మొక్కజొన్న	1440	2195
శనగపంట	82291	75426
పెసలు	3182	1379
మినుము	14731	16757
వేరుశనగ	6236	2285
నువ్వు	500	2844



దిగుబడి తగ్గింది: జిల్లాలో రబీలో ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవారం, రాజుపాలెం, సింహాద్రిపురం, కమలాపురం, వల్లూరు, పెండ్లిమర్రిలతోపాటు పలు మండలాల్లో 74426 హెక్టార్లలో శనగపంట సాగైంది. ఎకరా శనగపంట సాగుకు రూ. 25 నుంచి 30 వేల వరకు ఖర్చు వచ్చింది. పంటకు పూత, పిందే పట్టే సమయంలో వర్షాలతోపాటు పొగమంచుతో దిగుబడులు పడిపోయాయి. ధరలు కూడా అనుకూలంగా లేకపోవడంతో రైతులు నష్టమే మిగిలింది. ఎకరాకు 3 నుంచి 5 బస్తాల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం రూ. క్వింటా 5600 ధర ఉందని రైతులు తెలిపారు. దీంతో సాగు ఖర్చులు కూడా రావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వరిలో కూడా...

వరిపంటకు సంబంధించి కూడా ఈ ఏడాది ఆశించిన మేర దిగుబడి రాలేదు. ఎకరాకు 20 నుంచి 24 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని పలువురు రైతులు తెలిపారు. బాగా దిగుబడి వస్తే ఎకరాకు 28 నుంచి 32 బస్తాలు అవుతాయని రైతులు తెలిపారు. ఏదిఏమైనా ఈ ఏడాది చాలా పంటల దిగుబడి సొమ్ము సాగు ఖర్చులకు సరిపెట్టుకోవాల్సి వచ్చిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటంతా నేలపాలైంది



నేను ఎనిమిది ఎకరాల్లో శనగపంటను సాగు చేశాను. పంట పూత దశలో ఉన్నప్పుడు తెగుళ్ల సోకి పూత రాలిపోయింది. పంటంతా నేలపాలైంది. దిగుబడి తగ్గిపోయింది. ఎకరాకు 3,4 బస్తాల దిగుబడే వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పంట ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలి.
– కొండారెడ్డి, కొట్టాల గ్రామం, రాజుపాలెం మండలం.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



అధిక వర్షాలు, తెగుళ్లతో పంటలు దెబ్బతిన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల కింద క్రాప్ ఇన్సూరెన్స్ మంజూరు చేసి అన్నదాతకు అండగా నిలవాలి.
– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు



సింహ వాహనంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

పులివెందుల టౌన్: పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథ కాంప్లెక్స్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం రాత్రి శ్రీరంగనాథుడు సతీ సమేతుడై సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ పురవీధులైన మెయిన్ బజార్, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల మీదుగా మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు జరిగింది. భక్తులు స్వామి వారికి కాయ కర్పూరాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఉదయం ప్రధాన అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉభయదారులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవ ప్రాంగణంలో భజన బృందం భక్తి గీతాలను ఆలపించారు.

నేడు తలనీలాల కోసం వేలం

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న లంకమల అడవుల్లో వెలసిన నిత్యపూజా స్వామి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి.ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాల పోగు హక్కు కోసం గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

- కర్నూలు రేంజ్ డిఐజీ కోయ ప్రవీణ్
- రాయచోటి అర్బన్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, ప్రక్కన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి: నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పోలీస్ యంత్రాంగాన్ని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశించారు. బుధవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌ను డీఐజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి ఆయన సూచించారు. ఫిర్యాదు దారులపట్ల స్నేహభావాన్ని పెంపొందించుకొని సత్ప్రవర్తనతో ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల చర్యల పట్ల ఎప్పటికప్పుడు పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. అసాంఘిక కార్యక్రమాలను ప్రేరేపించే వారిపట్ల ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపార్ట్‌మెంట్‌లు, షాపులు, ప్రధాన రహదారులు, పాఠశాలల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించి వాటిని అమర్చుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించామన్నారు. ప్రతివారం మహిళా పోలీసులతో కలిసి పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో మాదక ద్రవ్యాలు, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, ఆన్‌లైన్, సైబర్ మోసాలు, వైట్ కాలర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించామన్నారు. అంతకు ముందు రాయచోటి స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల వివరాలు, రికార్డుల నిర్వహణ, శాంతి భద్రతల పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ పోలీసులకు తగు సూచనలు, సలహాలు చేశారు. డీఐజీ అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం వెంకటాద్రి, రాయచోటి సీఐ ఎన్ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి రాజా రమేష్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ తులసీరామ్, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న పులి భయం

- మొన్న బలపనూరు.. నిన్న ఇప్పట్ల
- నేడు నల్లపురెడ్డిపల్లెలో పులుల సంచారం





బలపనూరులో విద్యుత్ తీగలు తగిలి మృతిచెందిన చిరుత పులి (ఫైల్)



నల్లపురెడ్డిపల్లెలో పులి అడుగులు

పులివెందుల రూరల్: పులివెందుల నియోజకవర్గంలోని రైతులను పులుల భయం వెంటాడుతోంది. వారం రోజుల క్రితం సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామంలో విద్యుత్ తీగలకు తగిలి మగ చిరుత పులి మృతి చెందింది. దీంతో ఆడ పులితోపాటు రెండు పులి పిల్లలు సంచరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు చెబుతున్నారు. నాలుగు రోజుల కిందట పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో పులి సంచరిస్తున్నట్లు వారు చెప్పారు. అలాగే బుధవారం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె, లింగాల మండలం ఇప్పట్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో పులి సంచరించినట్లు చెబుతున్నారు. నియోజకవర్గంగా వివిధ గ్రామాల్లో పులులు సంచరిస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పులి కనిపించిందని రైతులు చెబుతున్నా ఫారెస్ట్ అధికారులు అక్కడికి వెళ్లి ఇవి పులి అడుగులు కాదు అడవి పిల్లివి అని చెబుతుండటం గమనార్హం. రాత్రి సమయాల్లో రైతులు, ప్రజలు తోటల వద్దకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రాణాపాయం జరిగితే ఎవరూ బాధ్యులు అని వారు వాపోతున్నారు.ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు స్పందించి పులివెందుల, లింగాల, తొండూరు మండలాల్లోని నల్లపురెడ్డిపల్లె, ఇప్పట్ల, క్రిష్ణంగారిపల్లె గ్రామ సమీపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పులి జాడను కనుక్కోవాలని కోరుతున్నారు.

రిమ్స్ విద్యార్థిని ప్రతిభ



హర్షిణిని అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ సురేఖ

కడప అర్బన్: జాతీయస్థాయిలో శస్త్రచికిత్స అవగాహన సదస్సులో కడప ప్రభుత్వవైద్య కళాశాలలో శస్త్రచికిత్స పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ యు. హర్షిణి ప్రతిభను కనపరిచారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆగ్రాలో జరిగిన సదస్సుకు హాజరైన హర్షిణి తమ విభాగంలోని అధునాతన మెలకువలను వివరించారు. ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. పీజీ విద్యార్థినిని, శస్త్ర చికిత్స విభాగం హెచ్ఓడి డాక్టర్ వాణి, వైద్యులను కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అభినందించారు.

అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయ ఈఓగా శ్రీనివాసులు



చాపాడు: జిల్లాలోని ముఖ్య పుణ్య క్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన ఈఓగా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం దేవదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఈఓగా ఉన్న మారుతి ప్రసాద్ లీవ్‌లో వెళ్లడంతో ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె గంగమ్మ దేవస్థానం ఈఓ శ్రీనివాసులును అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన ఇన్‌ఛార్జీ ఈఓగా నియమించారు.

23 నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి మధుసూధన్‌రావు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా రెవెన్యూ అధికారి మధుసూధన్ రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్రహోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు చూసేందుకు స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తారన్నారు.భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసలు బందోబస్తు నిర్వహించాలన్నారు. దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తహసీల్దార్ పుల్లారెడ్డి, విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఫిబ్రవరి 25 నుంచి 27వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఏఎస్పీ ప్రకాష్ బాబు, దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ లతో కలిసి.. దేవదాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలంలోని పొలతల శ్రీ మల్లీశ్వర స్వామి దేవస్థానం, సిద్దవటం మండలం వంతాటిపల్లిలోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానం, బ్రహ్మంగారిమఠం మండలంలోని కందిమల్లయ్యపల్లిలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, శ్రీ ఈశ్వరి దేవి మఠం, ప్రొద్దుటూరు మండలం లోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయం, గోపవరం మండలం లోని ఓబులం గ్రామపరిధిలో శ్రీ మల్లెం కొండేశ్వరస్వామి దేవాలయం, చాపాడు మండలం అల్లాడిపల్లిలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం, బద్వేలు మండలం లంకమల్ల గ్రామంలోని శ్రీ లంకమల్లేశ్వర స్వామి దేవాలయం లోని శ్రీ గుండాల ఈశ్వర స్వామి దేవాలయం, మైలవరం మండలంలోని అగస్తికోనలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయం, జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థంలో గల శ్రీ ఈశ్వర స్వామి ఆలయం, వీఎన్ పల్లె మండలంలోని అనిమేల సంఘమేశ్వర స్వామి దేవస్థానం, ఖాజీపేట మండలంలోని పుల్లూరు గ్రామంలోని శ్రీ నాథగేశ్వర స్వామి దేవాలయం తదితర 13 శైవక్షేత్రాలకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. వారందరికీ ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. సదరు దేవాలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడైతే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందో ఆ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉత్సవాలు జరిగే క్షేత్రాల్లో ఎక్కడా కూడా మద్యం అమ్మకాలు, సరఫరా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే అన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్, అందుబాటులో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా శైవక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న సందర్భంగా ప్రతి చోటా మహిళలకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శైవక్షేత్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహా శివరాత్రి పండుగ సందర్భంగా అన్ని శైవక్షేత్రాలలో పోలీసు బందోబస్తు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, ఏఎస్పి ప్రకాష్ బాబు, కడప నగర కమీషనర్ మనోజ్ రెడ్డి,కడప, జమ్మలమడుగు ఆర్డీఓలు జాన్ ఇర్విన్,సాయిశ్రీ, ఆయా దేవాలయాల ఈవోలు, చైర్మన్లు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విషద్రావణం తాగి బాలుడి మృతి


మోహిత్ (ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వెంగముని, దేవిల కుమారుడు మోహిత్ (14) మంగళవారం సాయంత్రం విష ద్రావణం తాగాడు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లపురెడ్డిపల్లె గ్రామంలో వెంగముని క్షౌరశాల పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మోహిత్ విష ద్రావణం తాగిన విషయం తెలుసుకుని వెంటనే పులివెందులలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బుధవారం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా బాలుడు విష ద్రావణం ఎందుకు తాగాడో అర్థం కావడం లేదని బంధువులు పేర్కొంటున్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా


సంఘటన స్థలంలో యువకుడి మృతదేహం

కొండాపురం : మండల పరిధిలోని రావికుంట వద్ద అదానీ హైడ్రోపవర్ ప్రాజెక్టు కంపెనీలో వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ ఐరేని విశ్వనాథ్(16) అక్కడికక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి తెలిపారు. మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన ఐరేని బలరామయ్య ఏకైక కుమారుడు ఐరేని విశ్వనాథ్. ఇతను వాటర్ ట్యాంకర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ట్యాంకర్‌ను నడుపుతున్న సమయంలో అది బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంగమ్మ జాతర ఏర్పాట్లపై ఆరాతీసిన ఈఓ

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ తల్లి జాతర మార్చి 1, 2 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనుంది. జాతరకు రాయలసీమలోని నాలుగు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం రామచంద్ర, సునీల్ యాదవ్, బోసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

పీలేరు : కారుతోపాటు రూ.15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని ఎంజేఆర్ కాలేజి వద్ద మంగళవారం రాత్రి నుంచి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు వెళ్లడంతో సిబ్బంది అప్రమత్తమై వెంబడించి అశోక్ నగర్ వద్ద పట్టుకున్నారు. వాహనంతో పాటు 301 కేజీల బరువు గల ఎర్రచందనం దుంగలు స్వా ధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన వెంకటేష్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది చంద్రశేఖర్, ప్రతాప్, కుప్పుస్వామి పాల్గొన్నారు.

శుభలేఖ..

స్వయంగా ఇచ్చే సమయం లేక!



- వివాహ ఆహ్వానంలో మారిన ట్రెండ్
- క్రమేపీ తగ్గుతున్న పెళ్లిపత్రికల పంపిణీ
- వాట్సాప్ ద్వారా చిటికెలో ఆహ్వానం

రాజంపేట టౌన్ : ఒకప్పుడు వివాహ వేడుకలో అన్నింటికంటే పెద్ద పని బంధువులకు, మిత్రులకు, ఆత్మీయులకు శుభలేఖలు ఇచ్చి ఆహ్వానించడం. అప్పట్లో స్వయంగా ఇంటికి వెళ్లి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానించడాన్ని ప్రజలు గౌరవంగా భావించేవారు. సమయం లేక.. ఇంటికి వెళ్లలేక మార్గమధ్యంలో కనిపించి పెళ్లిపత్రిక ఇస్తే పెళ్లిపత్రిక అందుకున్నవారు దానిని చిన్నతనంగా భావించేవారు కూడా. అయితే ఆధునిక కాలం అన్నింటిని మార్చేస్తూ వస్తోంది. అందులో వివాహ ఆహ్వానాల్లోను కొత్త ట్రెండ్ వచ్చేసింది. ఇప్పుడు దగ్గరి బంధువులకు, అతి ముఖ్యమైన వారికి మాత్రమే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పెళ్లి పత్రికలు ఇచ్చి ఆహ్వానిస్తున్నారు. ఇక మిత్రులను, వివిధ ప్రాంతాల్లో ఉండే తెలిసిన వారిని ఆహ్వానించడం క్షణాల్లో జరిగిపోతుంది. ప్రస్తుతం దాదాపు అందరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండటం వల్ల వధూవరులతో పాటు వారి తల్లిదండ్రులు వెడ్డింగ్ ఇన్విటేషన్ పేరుతో వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేస్తున్నారు. ఇక మిత్రులను, ఆత్మీయులను, పరిచయస్తులను ఆ గ్రూపులో చేర్చి పెళ్లిపత్రికను పంపిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు, ఉన్నత విద్యావంతులు ప్రీవెడ్డింగ్ షూట్ వీడియో క్లిప్పింగ్స్‌ను గ్రూపులో పెట్టి ఆహ్వానిస్తున్నారు. చివరిగా 'సేవ్ ది డేట్' అని వివాహ తేదీ, సమయం తెలిపే డిజిటల్ కార్డును కూడా గ్రూపులో పెడుతున్నారు. వివాహానికి వచ్చేవారు కల్యాణ మండపం ఎక్కడుందో తెలుసుకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గూగుల్ మ్యాప్ లొకేషన్‌ను కూడా షేర్ చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపులో పెళ్లిపత్రిక షేర్ చేసి ఆహ్వానించడమే కాక అతి ముఖ్యమైన మిత్రులకు, ఆత్మీయులకు ఫోన్ చేసి ఆహ్వానిస్తున్నారు. అయితే కొంతమంది ఇదేం పిలుపు అంటూ నిట్టూర్చేవారు లేక పోలేదు. ప్రస్తుతం అందరికి బంధుగణం ఎక్కువైంది, మిత్రులు, పరిచయాలు ఎక్కువయ్యాయి అందువల్ల సాంకేతికతను ఉపయోగించుకొని ఆహ్వానించడంలో తప్పులేదంటోంది నేటి తరం యువత. చాలా మంది వివాహ ఆహ్వాన పత్రికలను అతి తక్కువగా అచ్చు వేయిస్తున్నారు. ఇక పిల్లల మొదటి పుట్టిన రోజు, గృహప్రవేశం, ఆఫ్‌శారీ ఇలా ఫంక్షన్ ఏదైనా ఆహ్వానాలు వాట్సాప్ గ్రూపుల్లోనే సాగుతున్నాయి. ఈ కారణంగా శుభలేఖలు విక్రయించే వారికి, ప్రింటింగ్ ప్రెస్ వారికి ఆదాయం కూడా తగ్గింది.

చాలా హెల్ప్ అయింది



గత ఏడాది నా కుమారుడి వివాహం చేశాను. నాకుబంధువులు, మిత్రులు, ఆత్మీయులు ఎక్కువ స్థాయిలో ఉన్నారు. అందువల్ల చాలా మంది ఇళ్లకు స్వయంగా వెళ్లి పెళ్లిపత్రిక ఇచ్చి ఆహ్వానించలేక పోయా. స్వయంగా వెళ్లి ఆహ్వానించలేని వారందరిని కలిపి వాట్సాప్‌లో ఓ గ్రూపు ఏర్పాటు చేసి వెడ్డింగ్ కార్డు షేర్ చేసి ఆహ్వానించా. పరిస్థితిని అర్థం చేసుకొని దాదాపు అందరు నా కుమారుడి వివాహానికి వచ్చి ఆశీర్వదించారు. ఏదిఏమైనా ఆ సమయంలో వాట్సాప్ నాకు చాలా హెల్ప్ అయింది.

సీవీ.రమణయ్యశెట్టి, హెచ్ఎం, ఆకేపాడు ఉన్నత పాఠశాల, రాజంపేట మండలం

సైకిల్‌లో వెళ్లి ఇచ్చా



నాకు ముప్పై ఏళ్ల క్రితం వివాహం అయింది. ఆ రోజుల్లో రవాణా వ్యవస్థ పెద్దగా లేదు. అందువల్ల చుట్టుపక్కల ఉండే బంధువులకు, స్నేహితులకు సైకిల్‌పై వెళ్లిపెళ్లి పత్రికలు ఇచ్చా. సమయానికి సైకిల్‌ను ఇంట్లో వాళ్లు కాని, ఇరుగుపొరుగు వారు తీసుకెళ్లి వుంటే ఎవరో ఒకరిని తోడు చేసుకొని నడిచి వెళ్లి పెళ్లి పత్రికలు ఇచ్చాము. మా పిల్లల వివాహాలకు పెళ్లి పత్రికలు ఇవ్వడం పెద్దకష్టం అనిపించలేదు. బంధువులకు, ముఖ్యమైన మిత్రులు, కావాల్సిన వారికి మాత్రమే ఇంటికి వెళ్లి ఆహ్వానించా. మిగతా అందరికి వాట్సాప్‌లో వెడ్డింగ్ కార్డు షేర్ చేసి ఆహ్వానించా.

గుండ్రాతి చెంగల్‌రాయుడు, రాజంపేట

కార్డులు తక్కువగా అచ్చు వేయిస్తున్నారు



ఇటీవల కాలంలో చాలా మంది పెళ్లి పత్రికలను చాలా తక్కువగా అచ్చు వేయించుకుంటున్నారు. పెళ్లి పత్రికలను తక్కువగా వేయించుకుంటుండటం వల్ల ఖరీదైన వివాహ కార్డులను లేటెస్ట్ డిజైన్లలో ఎంపిక చేసుకుంటున్నారు. అందువల్ల వ్యాపారం కూడా కాస్త తగ్గింది. రాబోవు జనరేషన్ వివాహ ఆహ్వానాలన్నీ వాట్సాప్‌లలోనే కొనసాగించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

అనమలగుండం గణేష్, ప్రింటింగ్ ప్రెస్ యజమాని, రాజంపేట

అక్రమంగా తరలిస్తున్న 20 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


అధికారులు పట్టుకున్న బొలేరో వాహనం, రేషన్ బియ్యం

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో గుండాల ఓబులేసు 20 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. రేషన్ కార్డుదారుల నుంచి బియ్యాన్ని సేకరించి ఏపీ 39 యూఈ 1758 నంబర్‌గల బొలేరో వాహనంలో తరలిస్తుండగా గుర్తించామన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కోడిపందేల బరిపై పోలీసుల దాడి

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలో ని ఓబులంపల్లె గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న కంపచెట్ల ప్రదేశంలో కోడిపందేలు నిర్వహిస్తున్న బరిపై చింతకొమ్మదిన్నె సీఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి నిర్వహించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని మూడు కోడి పుంజులు, రూ. 700 నగదు, 8 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు.

శ్రీనివాస గోవిందా.. శ్రీవేంకటేశా గోవిందా


బ్రహ్మరథంలో కొలువుదీరిన సతీసమేత వేంకటరమణుడు

- కదిలిన శ్రీవారి బ్రహ్మరథం
- ప్రారంభించిన వైఎస్ మనోహర్‌రెడ్డి


పురవీధులలో శ్రీవేంకటరమణుడి రథోత్సవం


బ్రహ్మ రథోత్సవంలో పాల్గొన్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డున వెలసిన శ్రీవేంకటరమణుడి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటరమణుడు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం అఖిలాండ కోటి బ్రహ్మండ నాయకుడు, ఆదిమధ్యంత రహితుడు, భక్తకోటి సులభుడు అయిన శ్రీ వేంకటరమణుడు సతీసమేతుడై బ్రహ్మ రథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల మాడవీధులను తలపించేలా కనువిందు చేశారు. దేవ దేవున్ని దర్శించుకొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి గోవిందా..గోవిందా.. నామస్మరణలతో వేడుకున్నారు. ఆలయ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి రథోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్‌ను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు శాలువాలతో సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం వైఎస్ మనోహర్‌రెడ్డి రథానికి ఉన్న తాళ్లను పట్టుకొని ముందుకు కదిలించారు. రథోత్సవంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు.

దారి పొడవునా ప్రసాదాలు పంపిణీ

బ్రహ్మ రథోత్సవం సందర్భంగా పులివెందులలో దారిపొడవునా భక్తులు తమకు తోచిన విధంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. మజ్జిగ, మంచినీరు, పులిహోర, పెరుగుఅన్నం, బిస్కెట్స్, చాక్‌లెట్స్ రకరకాల ప్రసాదాలను భక్తులకు అందించి తమ భక్తిని చాటుకున్నారు.

ఆకట్టుకున్న వేషధారణ : రథోత్సవం వెంబడి శ్రీవేంకటరమణుడు, సీతారాముడు, హనుమంతుడు, కాంతారా వేష ధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. తిరుపతి కళా బృందాలచే నిర్వహించిన చెక్కభజన, కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్ జనరల్ సర్జరీ విభాగంలో అరుదైన శస్త్ర చికిత్స


కడుపులో నుంచి తొలగించిన పెద్ద కణితిని చూపిస్తున్న రిమ్స్ జనరల్ సర్జరీ వైద్య విభాగం బృందం

కడప అర్బన్ : కడప రిమ్స్‌లో జనరల్ శస్త్ర చికిత్స విభాగంలో ఓ యువకుడి కడుపులోని పెద్ద కణితి (6 కిలోల బరువు- 20 ఇంటు 20 సెం.మీల) ఆపరేషన్ నిర్వహించి తొలగించారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన యూనస్ (25) కడుపు ఉబ్బరం, నొప్పితో బాధపడుతూ రిమ్స్ శస్త్ర చికిత్స ఓ.పి.కి వచ్చాడు. డాక్టర్లు పరీక్షించి కడుపు లోపల పెద్ద కణితి ఉందని నిర్ధారించారు. శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైద్య బృందం రెండు గంటలపాటు శ్రమించి కణితిని తొలగించినట్లు తెలిపారు. ఈ అరుదైన ఆపరేషన్‌ను నిర్వహించిన శస్త్ర చికిత్స విభాగాన్ని, అనస్తీషియా (మత్తు) వైద్య విభాగ బృందాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అభినందించారు.

ఒంగోలు జాతి ఆవుకు కవల దూడల జననం


జన్మించిన కవల దూడలతో కృష్ణా నాయక్

చింతకొమ్మదిన్నె : మండలంలోని వేపమానుసత్రం గ్రామానికి చెందిన కృష్ణానాయక్ పెంచుకుంటున్న ఒంగోలు జాతి ఆవు ఇటీవల ఓ అరుదైన ఘటనకు కారకమైంది. ఈ ఆవు ఇప్పటికే 15 ఈతలు (లాక్టేషన్) ఇచ్చిన అనుభవజ్ఞ ఆవుగా ప్రసిద్ధి చెందింది. గతంలో ఈ ఆవు బిడ్డకూ కవలలు పుట్టాయి. విశేషంగా, ఈసారి కూడా అదే ఆవు కవల దూడలకు జన్మనిచ్చింది. ఈ సఫలతకు ప్రధాన కారణం కృత్రిమ గర్భధారణ విధానం. ఈ కృత్రిమ గర్భధారణను నాగిరెడ్డిపల్లె జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కిషోర్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆవు గర్భధారణ నుంచి దూడలు పుట్టే వరకు పశువైద్య నిపుణులు నాగరాజు పర్యవేక్షణ చేశారు. ప్రస్తుతం కవల దూడలు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాయని, వాటి పెంపకానికి అవసరమైన అన్ని వైద్య సేవలు అందుతున్నాయని కృష్ణా నాయక్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘట్టం పశుపోషణ రంగంలో ఒక గొప్ప విజయంగా నిలిచిందని వెటర్నరీ అధికారి కిషోర్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు


జనార్ధన్‌రెడ్డి కాలు నుజ్జయిన దృశ్యం

పోరుమామిళ్ల : స్థానిక డిగ్రీ కళాశాల వద్ద బుధవారం ఉదయం బైకును కారు ఢీ కొట్టిన ఘటనలో సిద్దవరం గ్రామానికి చెందిన గుత్తిరెడ్డి జనార్దనరెడ్డి(71) కుడికాలు నుజ్జయింది. ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు సిద్దవరం నుంచి బైక్‌పై జనార్దనరెడ్డి పోరుమామిళ్ల వస్తుండగా, పోరుమామిళ్ల నుంచి బద్వేలు వెళుతున్న కారు డిగ్రీ కాలేజీ వద్ద మలుపులో బైక్‌ను ఢీ కొంది. అంబులెన్స్‌లో బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కడపకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకుడు నారాయణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమతో పాటు నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని అఖిల పక్ష నాయకులు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్ కోరారు. బుధవారం నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరువు పీడిత ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని, రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని, రాయలసీమలోని ప్రధాన కార్యాలయాల తరలింపు చర్యలను నిలుపుదల చేయాలని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడుకు ఇటీవల వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమలను సెయిల్ ఆధ్వర్యంలో పూర్తి చేయాలని కోరారు. కడప- బెంగుళూరు రైల్వే లైన్ విజయవాడ వరకు పొడిగించి పూర్తిచేయాలన్నారు. ఈ అంశాలపై ఈ నెల 20 నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో చర్చించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు గుర్రప్ప సుబ్బరాయుడు, సత్తార్, ఆంజనేయులు, శ్రీకృష్ణదేవరాయలు, దాదాపీర్, నాగేంద్ర, రాము పాల్గొన్నారు.

లక్ష్మీ రెడ్డికి ప్రభుత్వం న్యాయం చేయాలి

- జనసేన నేత కిరణ్ రాయల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు బండి దీప్తి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు

కడప కార్పొరేషన్ : తిరుపతికి చెందిన లక్ష్మీ రెడ్డి అనే వివాహితకు ప్రభుత్వం న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర మహిళా అధ్యక్షురాలు బండి దీప్తి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతికి చెందిన లక్ష్మీ రెడ్డి అనే వివాహితకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్న జనసేన నేత కిరణ్ రాయల్, ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.1.20 కోట్ల నగదు, 300 గ్రాముల బంగారు తీసుకున్నాడన్నారు. పెళ్లి చేసుకోమని అడుగుతుంటే ఫోన్లలో, వీడియోల్లో ఆమెను, పిల్లలను చంపేస్తానని బెదిరిస్తున్నాడన్నారు. ఆమె ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఆమె ఫిర్యాదును తీసుకోకపోవడమేగాక 2021లో బిట్ కాయిన్ కేసులో ఆమె పాత్ర ఉందని, జైపూర్ నుంచి విమాన టికెట్లు పెట్టి పోలీసులను రప్పించి అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వ అరాచకానికి పరాకాష్ట అన్నారు. ఈ సంఘటనపై ఉన్నత న్యాయం స్థానం, జాతీయ మహిళా కమిషన్ జోక్యం చేసుకోవాలన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకూ తాము ఆమె తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ వచ్చాక రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని అబద్దాలు చెప్పిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ఒక మహిళకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మహిళల రక్షణకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టాన్ని, యాప్‌ను ఈ ప్రభుత్వం పక్కన బెట్టిందన్నారు. అందుకే రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. హోంమంత్రి సొంత నియోజకవర్గంలోనే ఒక బాలికపై అత్యాచారం చేసి, మృతదేహం కూడా కనిపించకుండా చేస్తే దిక్కులేదన్నారు. ఈ సమావేశంలో మహిళా నేతలు చైతల్య, బండి మరియలు, మూలే సరస్వతి, ఉమామహేశ్వరి, క్రిష్ణవేణి, తులశమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 మందుకు రూ.1000 జరిమానా

రశీదు ఇవ్వలేదంటూ పోలీసు స్టేషన్ ఎదుట తెలుగు తమ్ముడి ఆగ్రహం

రాయచోటి : రూ. 200 వెచ్చించి మద్యం తాగుతున్న తనకు వెయ్యి రూపాయలు జరిమానా విధించిన పోలీసులు రశీదు ఎందుకు ఇవ్వలేదంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మందు బాబు పోలీసు స్టేషన్ ఎదుటే పోలీసుల తీరును తూర్పారబట్టాడు. బుధవారం రాయచోటి పోలీస్ స్టేషన్ ఆవరణంలోనే నిరసన తెలుపుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన రవికుమార్ అనే వ్యక్తి విడుదల చేసిన వీడియో సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది. రాయచోటిలోని మదనపల్లి మార్గంలో ఉన్న ఓ మద్యం షాపు పక్కనే ఏర్పాటు చేసిన అనధికార మద్యం షాపులో రూ. 200 వెచ్చించి బీరు కొనుగోలు చేశానన్నాడు. ఓ హోటల్‌లో కూర్చుని బీరు తాగినందుకు హోటల్ యజమానిని వదిలి పోలీసులు తనను పట్టుకొచ్చారన్నాడు. తన సెల్‌ఫోన్ లాక్కొని వెయ్యి రూపాయలు జరిమానా విధించారని, ఇందుకు ఎలాంటి రశీదు ఇవ్వలేదన్నాడు. ప్రతిరోజూ వందల మంది మందు బాబులను ఆఫీసర్లు లేని సమయంలో పట్టుకురావడం, వెయ్యి రూపాయలు వసూలు చేయడం మామూలైపోయిందని మండిపడ్డాడు. ఈ డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయని ఆ తెలుగు తమ్ముడు స్టేషన్ ఆవరణంలో ప్రశ్నించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

స్కూలు విద్యార్థుల ఆటో బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

గుర్రంకొండ : సాయంకాలం పాఠశాల వదిలిన అనంతరం సొంత గ్రామానికి వెళదామంటే ఆర్టీసీ బస్సు లేదు. దీంతో విద్యార్థులు ఆటో ఎక్కారు. మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురై నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెకు చెందిన మిట్టపల్లి స్వాతి(13), కె.సాహితి(13), కురాకుల విష్ణు(13)లు గుర్రంకొండలోని తెలుగు జెడ్పీ హైస్కూలులో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన కురాకుల అరుణ్(17) గుర్రంకొండలోని తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలుగు జెడ్పీ హైస్కూల్ ఒకే ఆవరణంలో నిర్వహిస్తున్నారు. బుధవారం పాఠశాల, కళాశాల పనివేళలు ముగిసిన అనంతరం అందరూ సొంత గ్రామాలకు వెళ్లడానికి బయలుదేరారు. అయితే ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసు లేక పోవడంతో నలుగురు కలిసి ఆటోలో ఎక్కారు. ఆటో స్థానిక ఎర్రమిట్ట వద్దకు చేరుకోగానే డ్రైవర్ హఠాత్తుగా బ్రేకు వేయడంతో రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాహితికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన ముగ్గురికి రక్త గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను హుటాహుటిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేశారు.